క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్

ఆదోని అర్బన్: ఆదోని లయన్స్ క్లబ్, అవోపా, వామ్ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక సాయిభారతి ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ఉపాధ్యాయ దినోత్సవం ప్రాముఖ్యత, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి విద్యార్థులు వ్యాసాలు రాశారు. ప్రతిభ చూపిన మొదటి ముగ్గురికి బహుమతులు ప్రదానం చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు, క్లబ్ ఆదోని అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్‌గుప్తా, సభ్యులు వన్నపరాజు, అవోపా సభ్యులు వెంకటేశ్వర్లు, రఘు, మమతాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఒకరోజు వేతనం విరాళం

ఆదోనిటౌన్: ఆదోని సబ్‌డివిజన్ పరిధిలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు వరద బాధితులకు సహాయార్థం ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇవ్వనున్నట్లు ఆదోని జేఏసీ ప్రెసిడెంట్ యాసిన్‌బాషా, సెక్రటరీ రహంతుల్లా, ట్రెజరర్ రామ్మోహన్ బుధవారం తెలిపారు. విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి ఒకరోజు వేతనంకు సంబంధించిన లెటర్‌ను అందజేసినట్లు చెప్పారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మంత్రాలయం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంఎల్‌హెచ్‌పీ శివజ్యోతి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం ఖగ్గల్ గ్రామంలో హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆకు కూరగాయలు, పండ్లు, అధిక మోతాదులో ఆహర పదార్థాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్త భారతి, పాఠశాల సిబ్బంది ల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



అనిల్ కుమార్

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన అనిల్ కుమార్ అనే విద్యార్థి అదృశ్యమైనట్లు సీఐ గంగాధర్ బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు పూజారి పద్మావతి, పూజారి వెంకటేశ్వర్ల రెండవ కుమారుడు పూజారి అనిల్ కుమార్ ఎమ్మిగనూరులో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. అయితే ఈనెల 1వ తేదీన మధ్యాహ్నం 3:30 గంటలకు తన స్నేహితుడి ఇంటికి పుస్తకం ఇవ్వడానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, చుట్టూ పక్కల, బంధువుల ఇళ్ల దగ్గర రెండు రోజుల నుంచి వేతికిన ఆచూకి తెలియ లేదని తల్లి పూజారి పద్మావతి బుధవారం గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువతి అదృశ్యం

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ గ్రామానికి చెందిన బోయ వెన్నెల(19) అనే యువతి ఆగస్టు 29వ తేదీన రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుంచి అదృశ్యమైనట్లు తల్లి సుజాతమ్మ బుధవారం ఇస్వీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఘనంగా మహావీర్ జయంతి



మహావీర్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న జైన మతస్తులు

ఆదోని అర్బన్: మహావీర్ జయంతి సందర్భంగా బుధవారం జైన మతస్తులు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహావీర్ చిత్రపటంతో జైన్ మందిరం నుంచి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జైన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దేవరాజ్, జైన మతస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వీడాలి

ఆదోనిటౌన్: ఆదోని ఆర్టీసీ ఆఫీసు అధికారులు నిర్లక్ష్యం విడనాడాలని డిమాండ్ చేస్తూ బుధవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు డిపో ముందు ధర్నా చేపట్టారు. డిపో యూనియన్ అధ్యక్షుడు ఆరోగ్యప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ హరిబాబు, గ్యారేజీ సెక్రటరీ షరీఫ్ మాట్లాడారు. డిపోలో డ్రైవర్‌గా పనిచేసిన పి.ఎ. బాషా పదవీ విరమణ గావించాడు. తనకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల కోసం ఆఫీసు చుట్టూ ఆరునెలలుగా ప్రదక్షిణలు చేసినా సంబంధిత అధికారులు స్పందించలేదన్నారు. దీంతో పీఏ బాషా అనారోగ్యాల కారణంగా బుధవారం మృతిచెందాడన్నారు. అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా డిపో ముందు ఆందోళన చేపట్టారు. బాషా మృతికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ఖలీల్‌సాహెబ్, ఎజాజ్, సతీష్ పాల్గొన్నారు.

గురుదేవోభవ

- ఉత్తమ ఉపాధ్యాయులుగా పలువురు ఎంపిక
- నేడు అవార్డులు అందుకోనున్న గురువులు



దైవందిన్నె జెడ్పీ స్కూల్లో విద్యార్థులతో ఉత్తమ ఉపాధ్యాయుడు జి. వెంకటరమణ

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని దైవందిన్నె జెడ్పీ స్కూల్ హిందీ ఉపాధ్యాయుడు జి. వెంకటరమణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన టైలర్ జి. నారాయణరావు, జి. ప్రభావతిబాయిల కుమారుడు జి. వెంకటరమణ. అక్క, ముగ్గురు చెల్లెలు ఉన్నారు. తండ్రి టైలర్‌గా పనిచేస్తున్నారు. జి. వెంకటరమణకు భార్య జి. నాగమణి, కుమార్తెలు జి.మోనామృత, జి ముకుందప్రియ, జి. గౌతమ్‌నంద సంతానం. మొదటి సారిగా 2002 లో పాములపాడు మండలం వేపెంట ఎంపీపీ స్కూల్లో ఉద్యోగంలో చేరారు. తరువాత మిడతూరు మండలం విపనగండ్లకు బదిలీ అయ్యారు. 2017 సంవత్సరంలో తుగ్గలి మండలం జొన్నగిరి జిల్లా పరిషత్ పాఠశాలకు పదోన్నతిపై హిందీ ఉపాధ్యాయుడుగా వెళ్లారు. 2023లో ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె జిల్లా పరిషత్ పాఠశాలకు బదిలీపై వచ్చారు. వెంకటరమణ మాట్లాడుతూ.. 22 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తనకు ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు రావటం చాల సంతోషంగా ఉంది. తను పడ్డ కష్టానికి ప్రతి ఫలం అన్నారు. విద్యార్థులకు విద్యనందించడంతో అంకితభావంతో పనిచేస్తున్నానని, ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దటమే లక్ష్యంగా పెట్టుకున్నానని.,అవార్డుతో తన బాధ్యత ఇంకా పెరిగిందన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడుగా పి. ఈశ్వరప్ప



కోసిగి: కోసిగి మండలం కందుకూరు గ్రామంలో బయాలజీ ఉపాధ్యాయుడు పి.ఈశ్వరప్ప ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైయ్యారు. ఆయన సొంత గ్రామం గూడూరు. 2002లో డీఎస్సీలో ఎస్‌జీటీగా ఎంపికయ్యారు. మొదట దేవనకొండ మండలం బైరవకొండ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరాడు. ఆయన అక్కడ నుంచి ఎమ్మిగనూరు, సి.బెళగల్ మండలాల్లో పనిచేశారు. సి.బెళగల్ పని చేస్తుండగా గత ప్రభుత్వంలో బయాలజీ స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించారు. గతేడాది జూన్ నెల నుంచి కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆయన మాట్లాడుతూ.. అక్షరాస్యతలో వెనుకబడిన జిల్లాలోని మారుమూల ప్రాంతం కోసిగి మండలం కందుకూరు గ్రామంలో పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక కావడం సంతోషకరంగా ఉంది.

బాధ్యతను పెంచింది



మాది ఆస్పరి మండలం తంగరడోణ. మా అమ్మ నాన్న నారాయణ రెడ్డి, భాగ్యమ్మలకు నేనొక్కడనే కుమారుడును. మాది రైతు కుటుంబం. ఉన్నదాంట్లోనే మమ్ములను మా తల్లి దండ్రులు చదివించారు. నా విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ బడులలోనే కొనసాగింది. నా ఉద్యోగ ప్రస్థానం 1990 జూన్ 30వ తేదీన ఆస్పరి మండలం ములుగుంద గ్రామం ప్రైమరీ స్కూల్‌లో ప్రారంభమైంది. 2002 నవంబర్ 1వ తేదీన స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాను. నా 34 ఎండ్ల సర్వీసులో వివిధ ప్రాంతాల్లో పని చేస్తూ వచ్చాను. ప్రభుత్వం వారు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రకటించారని తెలిసింది. ఈ అవార్డు నాకు బాధ్యతలను పెంచింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు నా వంతు కృషి చేస్తా.

– ఎం.నరసింహా రెడ్డి, ఉపాధ్యాయుడు ఆర్‌జీ నగర్, ఆదోని

విద్యాభివృద్ధికి కృషి చేస్తా



ప్రభుత్వం ఉత్తమ అవార్డు ప్రకటించడం ద్వారా రెట్టింపు ఉత్సాహంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తా. మా అమ్మ నాన్న పి.వెంకటయ్య, వెంకటలక్ష్మమ్మ. నా విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే కొనసాగింది.1998 ఆగస్టు 14వ తేదీన ఉపాధ్యాయుడుగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించాను. 2009 ఫిబ్రవరి 2వ తేదీ స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాను. విద్యార్థులతో ఉన్న అనుబంధం చాల గొప్పది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తే పిల్లలు జీవితాంతం గుర్తించుకుంటారు.

– వై.వెంకటసుబ్బయ్య ఎస్‌ఏ. ఉపాధ్యాయుడు దొడ్డనగేరి.

చాలా సంతోషంగా ఉంది



ఉత్తమ అవార్డు ప్రకటించడంతో చాల సంతోష పడ్డాను. ఆదోని పట్టణంలోని నారాయణ రావు, సుబ్బమ్మలకు ఇద్దరు మగ పిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు. అందులో నేనే పెద్ద వాణ్ణి. మానాన్న టైలరింగ్ పని చేస్తూ మమ్ములను చదివిస్తూ వచ్చాడు. అందురు పది, ఇంటర్మీడియెట్‌కు ఆపేశారు. నేను చదువుకొని 1990 తుగ్గలి మండలం రాతనకొత్తూరులోని ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. 1998లో స్కూల్ అసిస్టంట్‌గా పదోన్నతి పొంది వివిధ ప్రాంతాల్లో పని చేస్తు ప్రస్తుతం డిపెప్ ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్నాను. ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రకటించడం ద్వారా చాల సంతోషంగా ఉంది.

– ఎస్.వెంకోబ, ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎం, విరుపాపురం.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

ఉపాధ్యాయుని పేరు	కేటగిరీ	పని చేసే స్థలం
ఎం.నరసింహారెడ్డి	స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ)	ఆదోని. జడ్పీ హైస్కూల్. ఆర్.జి నగర్
వై.వెంకట సుబ్బయ్య	స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)	ఆదోని. జడ్పీ హైస్కూల్. దొడ్డగేరి
షారోది వెంకోబ	ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం	ఆదోని.ఎంపీపీఎస్ డిపెప్. విరుపాపురం
ఎన్.రాజా సతీష్	స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)	ఆదోని.మున్సిపల్ హైస్కూల్. రెండో వార్డు
పి.ఈశ్వరప్ప	స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ)	జెడ్పీ హైస్కూల్. కందుకూరు. కోసిగి
ఎ.వేణుగోపాల్ శర్మ	స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)	జెడ్పీ హైస్కూల్. తుంగభద్ర. మంత్రాలయం
జి.విక్టోరియమ్మ	ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం	ఎంపీపీఎస్. జల్వాడ. పెద్దకడబూరు
కె.విజయకుమారి	స్కూల్ అసిస్టెంట్ (గణితం)	జెడ్పీ హైస్కూల్. హనుమాపురం. పెద్దకడబూరు
జి.వెంకటరమణ	స్కూల్ అసిస్టెంట్ (హిందీ)	జెడ్పీహైస్కూల్. దైవందిన్నె. ఎమ్మిగనూరు

వంతెనను పరిశీలించిన సబ్‌కలెక్టర్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

కౌతాళం: ఇటీవల మండలంలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను, రోడ్లను బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిశీలించారు. ముఖ్యంగా మండల పరిధిలోని ఉప్పరహాల్ గ్రామం వద్ద దెబ్బతిన్న కల్వర్టును పరిశీలించారు. దెబ్బతిన్న కల్వర్టును వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను సర్వే చేసి నివేదికలను సిద్ధం చేయాలని తహసీల్దారును ఆదేశించారు. వీలైనంత త్వరలో కల్వర్టు మరమ్మతులు చెసేలా చర్యలు తీసుకుంటానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. వీరి వెంట తహసీల్దారు మల్లికార్జునస్వామి, వ్యవసాయాధికారి శేషాద్రి, గ్రామ నాయకులు ఏకాంబర్‌రెడ్డి, ఈరన్న, నాగేంద్రప్ప, రంగస్వామి, గాదిలింగ పలువురు ఉన్నారు.

సబ్‌కలెక్టర్‌ను కలిసిన సంఘం సభ్యులు

ఆదోని రూరల్: ఆదోని నూతన సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను బుధవారం స్థానిక కార్యాలయంలో మానవ హక్కుల మరియు అవినీతి నిరోధక సంఘం ఫౌండర్, జాతీయ అధ్యక్షులు గుండారెడ్డి, మల్లికార్జునరెడ్డి, సౌత్ ఇండియా కో ఆర్డినేటర్ దేవానందనాయుడు కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సబ్‌కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

బైకుల దొంగ అరెస్ట్



స్వాధీనం చేసుకున్న వాహనాలు, నిందితుడి తో డీఎస్పీ శ్రీనివాస్ ఆచారి

మంత్రాలయం: జల్సాలకు అలవాటు పడి అక్రదారుల్లో డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని మంత్రాలయం పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం సాయంత్రం ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాస్ ఆచారి నిందితుడు వివరాల వెల్లడించారు. సి.బెళగల్ మండలం పొలుకల్లు గ్రామానికి చెందిన ఉప్పర యుగంధర్ కుమారుడు ఉప్పర వీరేష్ వృత్తి రిత్యా జేసీబీ డ్రైవర్. అయితే జల్సాలకు అలవాటు పడడంతో దొంగతనాలకు పాల్పడి డబ్బులు సంపాదనకు అలవాటుపడ్డాడు. ఈ క్రమంలోనే మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోసిగి, కర్నూలు, కళ్యాణ దుర్గంలోని ఒక ఆటో 5 ద్విచక్ర వాహనాలను దొంగలించాడు. బుధవారం సాయంత్రం అభయ ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర అనుమాన స్పద స్థితిలో సంచరిస్తుండగా మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ అదుపులో తీసుకుని విచారించగా చేసిన దొంగతనాలను అంగీకరించాడు. దేవనకొండ మండలం తెర్నేకల్లు గ్రామానికి చెందిర రాజు అనే వ్యక్తి ఉప్పర వీరేష్‌కు సహకరించినట్లు విచారణలో తేలిందని, ప్రస్తుతం రాజు పరారీలో ఉన్నాడని, త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. వాహనాలను రికవరీ చేయడంలో ప్రతిభను కనపరిచిన హెచ్‌కానిస్టేబుల్ రాఘవేంద్ర, కానిస్టేబుల్ దశరథ రాముడికి డీఎస్పీ రివార్డు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ, కానిస్టేబుల్ బసప్ప, గోవిందు, తదితరులు ఉన్నారు.

చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాస్ ఆచారి

మంత్రాలయం : వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాస్ ఆచారి సూచించారు. బుధవారం మంత్రాలయంలో సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్‌ల ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం సోదరులతో కలిసి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయక కొలువుతీరే ప్రాంతాలలో విగ్రహాలు ప్రతిష్టాపనకు పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

గోనెగండ్ల : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల దగ్గర వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ గంగాధర్ సూచించారు. బుధవారం సీఐ మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటుకు విద్యుత్, ఫైర్, పంచాయతీ అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇప్పటికే వినాయక విగ్రహాల ఏర్పాటు నిర్వాహకులకు తగు సూచనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

ఎల్‌ఎల్‌సీలో దూసుకెళ్లిన ఎద్దులబండి



ఎల్‌ఎల్‌సీలో ఎరువుల బస్తాలను వెలికి తీస్తున్న యువకులు

పెద్దకడబూరు : మండల పరిధిలోని మేకడోణ గ్రామ సమీపంలో బుధవారం ఎల్‌ఎల్‌సీలో ఎద్దుల బండి దూసుకెళ్లింది. బాధితుడు చాకలి ఉసేని, స్థానికులు తెలిపిన వివరాల మేరకు చాకలి ఉసేని తన మిరప పంటకు ఎరువులు చల్లడానికి అదే గ్రామానికి చెందిన కురువ వీరేష్‌ను కూలీ తీసుకొని ఎద్దులబండిపై 25 కాంప్లెక్స్ ఎరువులను వేసుకొని ఉదయం బయలుదేరారు. ఆ బండి ఎల్‌ఎల్‌సీపై వచ్చిన తరువాత ఎద్దులు బెదిరి కాలువలోకి లాక్కొని వెళ్లాయి. బండి ముందున్న వీరేష్ పక్కకు తప్పుకోగా గట్టుపై నుంచి కాలవలోకి ఎద్దులు బండితో సహా దూకాయి. కాలువలో పడ్డ వెంటనే కాడికి ఉన్న ఎద్దులను రైతు ఉసేని తప్పించాడు. గమనించిన స్థానికులు వెంటనే కాలువలో దూకి ఎరువుల బస్తాలకోసం వెతికారు. కాగా, 11 ఎరువుల సంచులను మాత్రమే చేతికి దొరికాయి. దాదాపు రూ. 50వేలకు పైగా నష్టం వాటిల్లి ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి



వీరంపల్లిలో ఉల్లి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

గోనెగండ్ల : రైతుల పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడంతో పాటు రైతుల పంట నిల్వ కోసం శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. గోనెగండ్ల మండలంలోని ఆయా గ్రామాల్లో కోసిన ఉల్లి పంట వర్షానికి తడిసిపోయి, అమ్మకానికి ఇబ్బంది పడుతున్న రైతులను బుధవారం సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ ఆనంద్‌బాబు పరామర్శించారు. రంగప్ప, సుజాత, రైతులు సురేష్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

కోసిగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ (రసాయన శాస్త్రం)గెస్ట్ లెక్చరర్‌గా పనిచేయుటకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి. లక్ష్మీదేవి కోరారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పోస్టు గ్రాడ్యుయేట్‌లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగి ఉన్న వారు ఈనెల 6వ తేదీలోగా తమ స ర్టిఫికెట్లతో కళాశాలలో దరఖాస్తు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 6281492028లకు సంప్రదించాలన్నారు.

దేవాలయ నిర్మాణానికి సహకరించాలి

పెద్దకడబూరు : మండల కేంద్రంలో పెద్ద లక్ష్మమ్మవ్వ నూతన దేవాలయ నిర్మాణానికి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు రామలింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రవిచంద్రరెడ్డి, నరసింహాచారి కోరారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో దేవాలయ నిర్మాణ శిల్పి దురగడ బాలసుబ్రహ్మణ్యచారిని వారు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా వారు ఆలయ నిర్మాణ పనులు, గర్భగుడి దేవాలయ ముఖ ద్వారము, మంటప స్తంభాలను పరిశీలించారు. కార్తీక మాసంలో ముఖద్వారం నిర్మాణము ఏర్పాటు చేసేవిధంగా పనులు సాగించాలని కోరారు. గ్రామ పెద్దలు నవీన్‌రెడ్డి, జంబన్న, సత్యన్న, దుబ్బన్న, కృష్ణమూర్తి, మల్లికార్జున ఉన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడి

పెద్దకడబూరు : మండల పరిధిలోని ముచ్చగిరి గ్రామం సమీపంలోని గంగమ్మ గుట్ట కొండల్లో నాటుసారా స్థావరాలపై ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తన సిబ్బందితో బుధవారం దాడులు చేశారు. గ్రామానికి చెందిన నెట్టకల్ నరసప్ప, మేకల తిక్కన్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి దగ్గర ఉన్న 10లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. కొండల్లో బట్టీలను, బెల్లం ఊటను ధ్వసం చేశారు.పోలీస్ సిబ్బంది నాగన్న, గోపాల్ తదితరులు ఉన్నారు.

పత్తిలో కాయకుళ్లు నివారణ చర్యలు

గోనెగండ్ల : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తి పంటలో మొగ్గలు రాలటం, కాయకుళ్లు నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. బుధవారం ఆయన మండల కేంద్రం గోనెగండ్లలోని పత్తి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాలకు పత్తి పంటలో మొగ్గ, పూత, పిందె రాలటం గమనించడం జరిగిందన్నారు. వీటి నివారణకు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. తర్వాత ప్లానోఫిక్స్ 1 మిల్లీ లీటర్ 5 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే కాయలపై మచ్చలు ఏర్పడి, పెద్దవిగా మారి కాయలు కుళ్లిపోయే అవకాశం ఉందన్నారు. కాయకుళ్లు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు మరియు స్ట్రెప్టోసైక్లిన్ 0.1 గ్రాము ఒక లీటర్ నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలని సూచించారు.

మెనూ ప్రకారం పోషకాహారం అందించాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన పోషకాహారం వడ్డించాలని తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ బంగారమ్మ, ఎంఈఓ- 2 మధుసుదన్‌రాజు సూచించారు. పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం, మరుగుదొడ్ల నిర్వహణపై ఎస్ఎంసీ చైర్మన్, హెచ్‌ఎం, ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో బుధవారం పట్టణంలోని ఉప్పర కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ప్రస్తుత మెనూ, మెనూ మార్పు తదితర అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకొన్నారు.

గోనెగండ్ల : స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ-2 నీలకంఠ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పాఠశాల చైర్మన్లు, మధ్యాహ్న భోజన వంట నిర్వహకులతో సమావేశం నిర్వహించారు.

గుడేకల్ కొండల్లో చిరుత!

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామ కొండల్లో చిరుతపులి ఉందనే పుకార్లు షికార్లు కొడుతున్నాయి. రెండు రోజుల క్రితం కోలంట్ల అంజినయ్యకు చెందిన మేక తల లేకుండా కొండల్లో ప్రత్యక్షం అయింది. మేకల గుంపు నుంచి రెండు రోజుల క్రితం అర్ధరాత్రి మేకను చిరుత ఎత్తుకెళ్లి చంపేసిందని మేకల కాపరులు చెబుతున్నారు. పులి సంచారం ఉందనే భయంతో గొర్రెలు, మేకల కాపరులు భయాందోళనలకు చెందుతున్నారు. అయితే గతంలో చిరుత పులి విషయంలో గొర్రెల కాపరులపై ఫారెస్ట్ అధికారులు కేసులు పెట్టడంతో చెప్పటానికి గొర్రెల యజమానులు భయపడుతున్నారు. గ్రామంలో పులి ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. మేకను చంపింది చిరుతపులినా, తోడేలాఅనేది తెలియాల్సి ఉంది.